సాక్షి నిజామాబాద్

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



అర్ధరాత్రి రోడ్లపై తిరగొద్దు

యువత అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ నగర సీపీ నరహరి హెచ్చరించారు.

- 8లో ▸



కార్పొరేటర్ కుమారుడి అరెస్ట్

నగరంలోని ఓ కార్పొరేటర్ కుమారుడు గంజాయి కేసులో అరెస్ట్ అయినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.9 /24.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రత ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కొందరు టీచర్లు నకిలీ ధృవీకరణ పత్రాలు సమర్పించారు. దీనిపై మరో ఉపాధ్యాయుడు పాఠశాల డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్‌ను ఆదేశించారు. దీంతో విద్యాశాఖ సూపరింటెండెంట్‌తో విచారణ కొనసాగుతోంది. 8 మంది టీచర్లు స్పౌస్ పాయింట్లు వినియోగించుకోవడంలో నకిలీ ధృవీకరణపత్రాలు సమర్పించినట్లు తేలింది. ఇదివరకే ఐదుగురు టీచర్లు నకిలీ సర్టిఫికెట్లను వాపస్ తీసుకోగా మరో 8 మంది ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

సుభాష్‌నగర్ : తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవానికి జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది గైర్హాజరుపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందించారు. కార్యక్రమానికి గైర్హాజరైన వారి వివరాలు నివేదించాలని కోరుతూ అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లో గైర్హాజరైన వారి నుంచి వివరణ తీసుకుని నివేదికలు అందజేయాలని ఆదేశించారు. కొన్ని శాఖలు ఇప్పటికే వివరాలు నివేదించగా, మరికొన్ని శాఖల నుంచి రావాల్సి ఉంది. ఈ విషయమై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. రెండ్రోజులుగా కలెక్టర్ ఆఫీస్‌లో నోటీసుల పైనే చర్చలు కొనసాగుతున్నాయి. గైర్హాజరైన వారి జాబితా ఇప్పటికే కలెక్టర్‌కు చేరిందని తెలిసింది. నోటీసులు అందుకున్న వారు ఉద్యోగ సంఘాల నాయకులను కలిసినట్లు సమాచారం. ఎవరెవరిపై ఏం చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

ముగిసిన గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీలు

నిజామాబాద్ అర్బన్ : ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీలు ముగిశాయి. ఇది జోన్ పోస్ట్ కావడంతో ఐదుగురు నిర్మల్‌కు జిల్లాకు వెళ్లారు. అక్కడి నుంచి గెజిటెడ్ హెచ్‌ఎంలు నిజామాబాద్ జిల్లాకు వచ్చారు. ఒకరు కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. మిగితా వారందరూ ఈ జిల్లాలోనే బదిలీపై వెళ్లారు.

తలసైనిక్ క్యాంప్‌నకు ఎంపిక



నిఖిలేశ్

నిజామాబాద్‌నాగారం: ఢిల్లీలో ఎన్‌సీసీ నిర్వహించే ప్రతిష్టాత్మక తల సైనిక్ క్యాంప్‌కు నిజామాబాద్ జిల్లాకు చెందిన కె. నిఖిలేశ్ ఎంపికైనట్లు సీఎస్‌ఐ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యరావు మంగళవారం తెలిపారు. సీఎస్‌ఐ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న నిఖిలేశ్ ఈనెల 19 నుంచి 30 వరకు ఢిల్లీలో జరుగనున్న ప్రత్యేక శిబిరంలో పాల్గొననున్నారు.

తహసీల్దార్‌పై చీటింగ్ కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన లత, కంజర్ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము మంగళవారం తెలిపారు. మండల పరిధికి చెందిన సాంబారు రేవతి తన తల్లి పేరు మీద ఉన్న 23 గుంటల భూమిని వారసురాలైన తనపై కాకుండా చిన్న నర్సయ్యపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..





పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువ జన సంఘాల మండ పాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల కు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సప్ నెం.
8978036828


నారీ శక్తి.. వందనం

'నారి శక్తి వందనం' పేరిట చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపడం, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం పట్ల మహిళా నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో, రాష్ట్రంలో 2026లో నియోజకవర్గాల పునర్విభజన చేసిన తరువాత నుంచి ఈ రిజర్వేషన్లు అమలయ్యేలా మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పలువురు మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై మహిళాలోకం స్వాగతం
- కేంద్ర కేబినెట్ ఆమోదం, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడంపై హర్షాతిరేకాలు
- చరిత్రాత్మకమంటున్న మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు





మూడు దశాబ్దాల కల నెరవేరబోతోంది..



గత మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడం గొప్పవిషయం. ఇది మోదీ ప్రభుత్వ విజయం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూడు దశాబ్దాల పాటు ఈ బిల్లు విషయమై నాన్చుతూ వచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఈ బిల్లు వీగిపోయేలా చేశారు. ఇప్పుడు కొత్త పార్లమెంట్ భవనంలో ప్రధాని మోదీ నాయకత్వంలో చరిత్రాత్మక బిల్లుకు మోక్షం లభించడం సంతోషం. ఇండియా కూటమికి మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లును ఆమోదించేలా చేయాలి. మహిళా బిల్లును ఆమోదించకపోతే ఈ అంశం రాహుల్ గాంధీ విజ్ఞతకే వదిలేస్తున్నాం. ప్రధానికి మహిళల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. – ఏలేటి అన్నపూర్ణమ్మ, మాజీ ఎమ్మెల్యే

ప్రధాని మోదీ, బీజేపీకి ధన్యవాదాలు..



మహిళా బిల్లుకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ, బీజేపీకి జిల్లా మహిళల తరపున ప్రత్యేక ధన్యవాదాలు. భారతదేశ చరిత్రలో మహిళలకు శుభదినం. సామర్థ్యమున్న మహిళలకు సమాజ సేవ చేసే అవకాశాన్ని ప్రధాని మోదీ కల్పించారు. బీజేపీ మాత్రమే గతంలో ఉమాభారతి, సుష్మాస్వరాజ్, వసుంధరారాజే సింధియా, ఆనందీబెన్ పటేల్ లను ముఖ్యమంత్రులను చేసింది. కేంద్ర ఆర్థికమంత్రి, రక్షణ మంత్రి, విదేశీ వ్యవహారాల మంత్రి లాంటి కీలకమైన శాఖలు అప్పగించింది బీజేపీ ప్రభుత్వంలో మాత్రమే.
– గోపిడి స్రవంతిరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్‌లీడర్

తక్షణమే అమలు చేయాలి..



చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ జరగబోయే ఎన్నికల నుంచే అమలు చేయడం ప్రారంభించాలి. లేకుంటే మరో ఐదేళ్లపాటు మహిళలను అవమానించినట్లే. ఈ బిల్లు 2027 ఎన్నికల నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించడం సరికాదు. గతంలో రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లును యథావిధిగా కొనసాగించాలి. అప్పటివరకు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే పెరిగిన సీట్లలో మళ్లీ మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి. మహిళా బిల్లును ఆమోదించినందుకు ధన్యవాదాలు.
– సుమన రెడ్డి, జెడ్పీటీసీ, ఇందల్వాయి

మహిళలు రాజకీయంగా ఎదిగే అవకాశం..



ఎమ్మెల్సీ కవిత నిరంతర పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న లక్ష్యంతో ధృఢ సంకల్పంతో పోరాటాన్ని కొనసాగించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం సంతోషకరం. ఇప్పటివరకు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు రాణించారు. రాజకీయంగా అవకాశాలు లేక రాణించలేకపోయారు. మహిళా బిల్లుకు ఆమోదం తెలపడంతో రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. – దండు నీతూకిరణ్, మేయర్

సమాజానికి మరింత మేలు..



చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడమంటే సమాజానికి గొప్ప మేలు చేసినట్లు. అమ్మగా, అధికారులుగా, శాస్త్రవేత్తలుగా, వ్యాపారులుగా, క్రీడాకారులుగా మహిళలు సాధించిన విజయాలు అసామాన్యమైనవి. భూదేవంత ఓపిక ఉన్న మహిళలు, ఆకాశమంత ఎత్తుకు సైతం ఎదగగలరు. సమాజాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మహిళల పాత్ర అత్యంత కీలకం. అనేక దశాబ్దాల కల నెరవేరుతుండడం సంతోషకరం. – గోర్త పద్మ, సర్పంచ్, అర్గుల్

మహిళల దశాబ్దాల స్వప్నం



మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్స్ దశాబ్దాల స్వప్నం. ఈ బిల్లు కోసం మహిళలు సుదీర్ఘకాలంగా పోరాటాలు చేశారు. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నా. మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం కొన్ని నెలల క్రితం ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో ఢిల్లీలో చేసిన ధర్నాలో పాల్గొన్నా. మహిళలు అనేక రంగాల్లో రాణించి ప్రతిభ చాటుతున్నారు. చట్టసభలో మహిళలకు సముచిత స్థానం దక్కాల్సిందే. – ఆయేషా ఫాతిమా, బీఆర్‌ఎస్ నాయకురాలు

చాలా సంతోషకరం..



33 శాతంమహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టడం సంతోషకరం. ప్రస్తుతం జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు చట్ట సభల్లో అతి తక్కువ ప్రాధాన్యత ఉంది. ఈ బిల్లుతో ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఎమ్మెల్సీ కవిత మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వివిధ రాజకీయ పార్టీలను ఏకతాటి పైకి తెచ్చి చాలా కృషి చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేశారు. – రజితయాదవ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్

మహిళా బిల్లు హర్షణీయం




33 శాతం మహిళా రిజర్వేషన్ల బిల్లు వల్ల మహిళలకు చట్టసభల్లో అవకాశం పెరుగుతుంది. గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుంది. రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన పోరాటానికి కేంద్రం దిగొచ్చి బిల్లును ఆమోదింపజేయడం శుభ పరిణామం.
– పొట్కూరి తనూజ రెడ్డి, జెడ్పీటీసీ, జక్రాన్‌పల్లి

మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నా..



33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లును సంతోషంగా స్వాగతిస్తున్నా. మహిళలోకం ఎన్నో ఏళ్లుగా చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తోంది. దీని కోసం అనేక పోరాటాలు జరిగాయి. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించి వెంటనే అమలు చేయాలి. కాలయాపన చేయవద్దు. బిల్లుతో చట్టసభల్లో మహిళలకు గౌరవం దక్కుతుంది.
– తూము పద్మ శరత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, బోధన్

కొలువుదీరిన బొజ్జగణపయ్య



జిల్లావ్యాప్తంగా వినాయక చవితిని సోమవారం వైభవంగా జరుపుకున్నారు. వాడవాడలా మేళతాళాలతో భక్తులు తోడురాగా విఘ్నేశ్వరుడు మండపాల్లో కొలువుదీరాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పెరుగుతోన్న విద్యుత్ చౌర్యం

- ఫైన్లు వేస్తున్నా వసూళ్లు అంతంతే..
- విఫలమవుతున్న విద్యుత్ శాఖాధికారులు

నిజామాబాద్‌నాగారం : విద్యుత్‌శాఖకు నష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గడిచిన ఏప్రిల్ నుంచి ఆగస్ట్ వరకు జిల్లాలో 1,369 కేసులు నమోదయ్యాయంటే విద్యుత్ చౌర్యం ఏ లెవల్లో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. 1,369 కేసులకు గాను రూ. 11.64 లక్షల ఫైన్లు వేశారు. అయితే ఇక్కడే మతలబుంది.. ఇన్ని లక్షల్లో ఫైన్లు వేసినప్పటికీ వసూళ్లు చేయడంలో మాత్రం విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. నెలవారీగా కరెంటు బిల్లులు కట్టడంలో సందర్భంలో కరెంట్ కనెక్షన్ తొలగించే అధికారులు చౌర్యం కేసుల్లో ఫైన్లు వేసి వాటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో శాఖకు నష్టాలు తప్పట్లేదు. నిజామాబాద్ జిల్లాలో ఎక్కడైనా విద్యుత్‌చౌర్యం జరిగితే మళ్లీ జరగకుండా చూడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పెరుగుతున్న కేసుల సంఖ్యను చూస్తేనే అర్థం అవుతుంది. శాఖాధికారులే వారికి మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. గతేడాదిలో 1,167 కేసులు నమోదు కాగా రూ. 99 లక్షలపైనే ఫైన్లు వేశారు.

వసూళ్లలో తీవ్ర జాప్యం

విద్యుత్‌చౌర్యంకు సంబంధించి కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. అధికారులు ఫైన్‌లు వేస్తున్నే ఉన్నారు. వసూళ్లు మాత్రం కావడం లేదు. ఇలా రోజులు కాస్త నెలలు ఏడాది గడిచినా తీరు మారడం లేదు. దీంతో కేసులు నమోదవుతూనే ఉన్నాయి.

ఫైన్లు వసూలు చేయాల్సిందే..

విద్యుత్‌చౌర్యం కేసులకు సంబంధించి ఫైన్లు వేస్తాం. కేసులకు సంబంధించి ఫైన్‌లు కూడా వసూళ్లు చేయాల్సిందే. దీనిపై సంబంధిత అధికారులతో సమీక్షించి త్వరగా వసూళ్లు అయ్యేలా చర్యలు తీసుకుంటాను. – రవీందర్, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

- మనందరిపై బాధ్యత ఉంటుంది
- అక్టోబర్ మొదటివారంలో 'యూనివర్సిటీ' సినిమా విడుదల
- ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత, నటులు ఆర్ నారాయణమూర్తి



మాట్లాడుతున్న నిర్మాత ఆర్ నారాయణ మూర్తి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): విద్యారంగం చిన్నాభిన్నం అయితే మొత్తం వ్యవస్థే చిన్నాభిన్నం అవుతుందని ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత, నటులు ఆర్ నారాయణమూర్తి అన్నారు. విద్యార్థులే రేపటి జాతి సంపద అని విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని పేర్కొన్నారు. తాను నిర్మిస్తున్న 'యూనివర్సిటీ' సినీ ప్రమోషన్‌లో భాగంగా ఆయన మంగళవారం నిజామాబాద్ జిల్లాకు వచ్చారు. జిల్లా కేంద్రంలోని పలు డిగ్రీ, పీజీ కళాశాలలతో పాటు డిచ్‌పల్లిలోని తెలంగాణ వర్సిటీని సందర్శించి అక్కడి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. అనంతరం 'సాక్షి' యూనిట్ కార్యాలయాన్ని సందర్శించి తన సినిమా వివరాలను వెల్లడించారు. స్నేహచిత్రపిక్చర్స్ బ్యానర్‌పై 32వ చిత్రంగా యూనివర్సిటీ సినిమాను కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం అందించడంతో పాటు తన స్వీయ దర్శకత్వంలోనే నిర్మిస్తున్నట్లు నారాయణ మూర్తి తెలిపారు. ఈ సినిమాకు ఎడిటింగ్ ఎంఏమాలిక్, కెమెరామెన్‌గా బాబూరావుదాసు పని చేశారని, తనతో పాటు వైఎస్ కృష్ణేశ్వరరావు, స్థానిక కళాకారులు, యూనివర్సిటీ విద్యార్థులు నటించినట్లు తెలిపారు. సినిమాలో 6 పాటలను దివంగత గద్దర్, జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్, మూలుగు విజయ్ రచించినట్లు తెలిపారు. ఆ పాటలను గద్దర్, సాయిచరణ్, గోసికుల రమేష్, మూలుగు విజయ్ పాడారని చెప్పారు. విద్య, వైద్యం రెండూ సేవారంగాలని, అయితే కొద్దిమంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపార రంగాలుగా మారాయన్నారు. కాలేజీల్లోనే కాకుండా ఉద్యోగ ప్రశ్నాపత్రాల లీకేజీలు అవుతున్నాయని, ఇవి కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే పరిమితం కాలేదన్నారు. ఇప్పటి వరకు గుజరాత్, అస్సాంలో 17 సార్లు, మధ్యప్రదేశ్‌లో 14 సార్లు, బీహార్ లో 12 సార్లు, ఉత్తరప్రదేశ్‌లో 9 సార్లు ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు జరిగాయన్నారు. వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని తెలియజేయడానికే ఈ సినిమా నిర్మించినట్లు తెలిపారు. అక్టోబర్ మొదటివారంలో ఈ సినిమా రిలీజ్ ఉంటుందన్నారు. యూనివర్సిటీ సినిమాను తెలంగాణ లో ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, శిరీష్‌రెడ్డి డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారని నారాయణమూర్తి తెలిపారు. తన సినిమాను అన్ని వర్గాలవారు ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.


'విజయభేరి' ఉత్సాహం

- తుక్కుగూడ సభ విజయవంతంతో కాంగ్రెస్‌లో ధీమా
- రెట్టించిన జోష్‌తో నాయకులు, కార్యకర్తలు
- రేవంత్ రెడ్డి పాదయాత్ర, రాహుల్ భారత్ జోడో యాత్ర నుంచి పెరుగుతున్న గ్రాఫ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు హాజరైన తుక్కుగూడ బహిరంగ సభ విజయవంతం కావడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే కర్ణాటక విజయం నేపథ్యంలో పార్టీ శ్రేణులు వరుస కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లాలో పర్యటించిన ఇన్‌చార్జులు తగిన దిశానిర్దేశం చేస్తున్నారు. తాజాగా అగ్రనేతలు సోనియా, రాహుల్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న తుక్కుగూడ సభకు నిజామాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు భారీగా జనసమీకరణ చేశారు. వందలాది వాహనాల్లో బహిరంగసభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. టిక్కెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు ఇప్పటికే విడతలవారీగా చేస్తున్న సర్వేల్లో తామే ముందుండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తుక్కుగూడ సభకు పోటాపోటీగా జనాన్ని తరలించుకుని వెళ్లారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ పాదయాత్ర, జుక్కల్‌లో రాహుల్ భారత్ జోడో యాత్ర తరువాత నుంచి క్రమంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతూ వచ్చింది. తర్వాత కర్ణాటక విజయం నుంచి మరింత ఉత్సాహం వచ్చింది. పార్టీ టిక్కెట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించిన నేపథ్యంలోనూ జిల్లా నుంచి భారీ స్పందన వచ్చింది. తుక్కుగూడ సభ లో పాల్గొన్న పార్టీ అగ్రనేతలు ఇచ్చిన ఆరు గ్యారంటీలు పార్టీని అధికారంలోకి తీసుకొస్తాయని నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో కొన్ని నెలల కిందటి వరకు స్తబ్దుగా ఉన్న పార్టీలో ఇంత ఉత్సాహం రావడంతో పార్టీ నాయకత్వం సైతం మరింత జాగ్రత్తగా వ్యూహాలకు పదును పెడుతోంది. విజయభేరి సభ జయప్రదం కావడంతో క్షేత్రస్థాయికి మరింత దూకుడుగా వెళ్లేందుకు పార్టీ శ్రేణులు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నాయి.

గెలిపించేందుకు ప్రజలు సిద్ధం



మహేశ్‌కుమార్ గౌడ్
పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై నిశ్శబ్ద విప్లవం నడుస్తోంది. బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకు ప్రజలు కసిగా ఉన్నారు. ఇందుకు తాజాగా జరిగిన విజయభేరి సభ సక్సెస్ కావడమే నిదర్శనం. లక్షలాది మంది జ నం సభకు ఉత్సాహంగా తరలివచ్చారు. పదుల కిలోమీటర్ల కొద్దీ జనం బారులు తీరి వచ్చారంటేనే కాంగ్రెస్ గెలుపు సమీపానికి వచ్చినట్లు. 80 సీట్లతో కాంగ్రెస్ అధికారం దక్కించుకోవడం ఖాయం. సభలో కాంగ్రెస్ అగ్రనేతలు ఇచ్చిన ఆరు హామీలు కచ్చితంగా అమలు చేస్తామనే నమ్మకం ప్రజల్లో ఉంది. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువవికాసం, చేయూత పథకాల ద్వారా అన్ని వర్గాలకు మేలు కలుగుతుంది. వరి ధాన్యం మద్దతు ధరతో పాటు బోనస్ క్వింటాలుకు రూ.500, మహిళలకు రూ.500కే వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలకు రూ. 2,500, రైతులకు, కౌలు రైతులకు రూ. 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, ఇంటి స్థలం, ఇంటి కట్టుబడికి రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 గజాలు, విద్యార్థుల చదువుకు రూ.5లక్షలు అందించే పథకాలు తిరుగులేనివన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకముంది. దీంతో అధికారంలోకి కాంగ్రెస్ రావడం తథ్యం.

క్లుప్తంగా

ఎడపల్లిని సందర్శించిన మలేరియా అధికారి

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలో ఇద్దరికి డెంగీ సోకడంతో జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, జిల్లా లార్వా సర్వే అధికారి కిరణ్ కుమార్ గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారిని సిబ్బందితో కలిసి పరీక్షించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

అర్ధరాత్రి రోడ్లపై తిరగొద్దు



ఖలీల్‌వాడి: యువత అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవని పట్టణ సీఐ నరహరి హెచ్చరించారు. సోమవారం అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న 66 మంది యువకులు, 23 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకొని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే దొంగలను గుర్తించడం కష్టమవుతుందని పేర్కొన్నారు. యువకులు పోలీసుల సూచనలు పాటించాలని లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం యువకులు వారి కుటుంబ సభ్యులకు సీఐ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై సంజీవ్, సిబ్బంది రమేశ్, అనిల్, భూరాజ్, రమేశ్, రాకేశ్ ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా నిరసన చేపట్టిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం తమ మద్దతు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వెంటనే అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పవన్, రవీందర్, శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలు సమాజానికి దిక్సూచి

తెయూ(డిచ్‌పల్లి), సుభాష్‌నగర్: విశ్వవిద్యాలయాలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని ప్రముఖ సినీ దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీని ఆయన మంగళవారం సందర్శించారు. తాను నిర్మిస్తున్న 'యూనివర్సిటీ' అనే చిత్రంలో విశ్వవిద్యాలయాల సమస్యలు భూమికగా ఉండబోతున్నాయన్నారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరి, ఉద్యోగులు నారాయణమూర్తి సన్మానించారు. అనంతరం జిల్లాలోని ఎస్ఎస్ఆర్, నిశిత, ఎస్వీ, హరిచరణ్, పలు కళాశాలల యాజమాన్యాలతోపాటు పలువురిని నారాయణమూర్తి కలిశారు. సినిమాను విజయవంతం చేయాలని కోరారు. సాదాసీదాగా ఆటోలో వచ్చిన ఆయనను గుర్తించిన పలువురు నాయకులు, ప్రజలు సెల్ఫీలు దిగారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్



రుద్రూర్: మండల కేంద్రంలో ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. వ్యక్తిగత సమస్యలతో సెల్ టవర్ ఎక్కిన లక్ష్మణ్‌కు పోలీసులు పలు విధాలుగా సముదాయించిన వినిపించుకోలేదు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో దిగి వచ్చాడు. పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. మరోమారు చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ జయేశ్ రెడ్డి, ఎస్సై నీలేశ్ హెచ్చరించారు.

ఏకదంతుడు.. విభిన్న రూపాలు

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిజామాబాద్‌లో కొలువు దీరిన విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. వర్ని రోడ్డులో ఏర్పాటు చేసిన కొబ్బరికాయలు, కలశాలతో 20 ఫీట్ల గణనాథుడు, మహ్మదేవినగర్‌లో ఐదురకాల పోకలతో ఏర్పాటుచేసిన గణనాథుడు, అస్మికాలనీలో వెండితో, మహ్మదేవీయూత్ ఆధ్వర్యంలో ముత్యాల అలంకరణతో, బురుదుగల్లీలో ఎక్వేరియం స్టోన్స్‌తో తయారుచేసిన గణనాథులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



శ్రీరవీంద్రగణేశ్ మండలి ఆధ్వర్యంలో..




కలెక్టరేట్‌లో కొలువుదీరిన గణనాథుడు



భక్త హిందూ యూత్ గణనాథుడు



రైజింగ్ స్టార్ యూత్ గణనాథుడు



బజరంగ్‌యూత్ ఆధ్వర్యంలో..



మహ్మదేవియూత్ ఆధ్వర్యంలో..

చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

- చిన్నారి మృతికి కారణమైన ఆసుపత్రిని మూసివేయాలి
- డెంగీతో మృతి చెందిన బాలుడి తల్లిదండ్రుల ఆవేదన



ఆద్యంత్ (ఫైల్)

రామారెడ్డి (ఎల్లారెడ్డి): చిన్నారుల ప్రాణాలతో ఓ ప్రైవేటు ఆసుపత్రి చెలగాటం ఆడుతోందని బాధిత తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డెంగీతో మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులు అన్వేశ్, సౌందర్య ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు ఆద్యంత్ ఈ నెల 17న డెంగీతో మృతి చెందినట్లు ఆరోపించారు. ఈ నెల 8న సదరు ఆసుపత్రికి జ్వరం ఉందని తమ కుమారుడిని తీసుకెళ్లగా



మాట్లాడుతున్న సౌందర్య, అన్వేశ్

పరీక్షించిన వైద్యులు మందులు రాసిచ్చి పంపించారు. మళ్లీ 15న జ్వరం ఉందని వెళ్తే అడ్మిట్‌చేసుకొని పరీక్షలు చేసి 16న డెంగీ ఉందని చెప్పి ఐసీయూలో చికిత్స అందించారు. చివరి క్షణంలో హైదరాబాద్ తీసుకెళ్లాలని సమాధానం ఇవ్వడంతో తీసుకెళ్లినట్లు తెలిపారు. 17న హైదరాబాద్‌లో చికిత్స అందిస్తుండగా బాబు మృతి చెందాడు. కామారెడ్డి ఆసుపత్రి నిర్లక్ష్యపు వైద్యులతోనే తమ కుమారుడు మృతి చెందాడని అధికారులు స్పందించి ఆసుపత్రిని మూసివేయాలని డిమాండ్ శారు. దీనిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబీకులు తెలిపారు.

కార్పొరేటర్ కుమారుడి అరెస్ట్..?

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ కార్పొరేటర్ కుమారుడు గంజాయి కేసులో అరెస్ట్ అయినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితం కార్పొరేటర్ కుమారుడిని మహారాష్ట్రలోని దెగ్లూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గతంలో కార్పొరేటర్ కుమారుడు గంజాయి దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సదరు నేతపై గంజాయి కేసులు ఉండడంతో గతంలో పీడీ యాక్ట్ అమలు చేసినట్లు తెలిసింది. దీంతో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించినట్లు సమాచారం. వారం రోజుల క్రితం మహారాష్ట్రలోని దెగ్లూర్ ప్రాంతం నుంచి కారులో గంజాయిని తరలిస్తుండగా అక్కడి పోలీసులు పట్టుకుని విచారించగా కార్పొరేటర్ కుమారుడి పేరును ప్రస్తావించడంతో అక్కడి పోలీసులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మూడు రోజుల క్రితం సీపీ జిల్లా కేంద్రంలో గంజాయిపై కౌన్సిలింగ్ నిర్వహించారు. పీడీ యాక్ట్ ఉన్న సదరు కార్పొరేటర్ కుమారుడు ఈ కౌన్సిలింగ్‌కు రాకపోవడంపై చర్చ కొనసాగింది. గంజాయి తరలింపులో సదరు నేత అరెస్ట్ కావడంతో చర్చనీయాంశంగా మారింది.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఏడుగురి మృతి




సాయిలు (ఫైల్)

డొంకేశ్వర్, నందిపేట్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం అన్నారం శివారులోని కాలువలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ మంగళవారం తెలిపారు. నందిపేట్ మండలం ఇందిరానగర్‌కు చెందిన అలికె సాయిలు తన కుటుంబంతో కలిసి నూత్‌పల్లిలో వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. కాలువలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి సాయిలు మృతదేహంగా గుర్తించారు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు.

పిట్లంలో ఒకరు..

పిట్లం(జుక్కల్): మండలంలోని పోతిరెడ్డిపల్లి రూమ్ తండా స మీపంలో ఉన్న కల్వర్టులో అనుమానాస్పదస్థితి లో మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పిట్లంకు చెందిన బాలయ్య (60) ఈ నెల 17న మండలంలోని గౌరా రం గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించగా



బాలయ్య (ఫైల్)

కల్వ ర్టులో మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్..



మంగాదేవి (ఫైల్)

వర్ని: మండలంలోని అఫంది ఫారం అంగన్‌వాడీ టీచర్ మంగాదేవి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వకీల్ ఫారంకు చెందిన మంగాదేవి అఫంది ఫారంలో 20 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

చికిత్స పొందుతూ ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లికి చెందిన నక్క కాశీరాం(32) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. కాశీరాం మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని జీవితంపై విరక్తితో ఈ నెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నాగమడుగు ఎత్తిపోతల పథకం పనుల వద్ద సోమవారం విద్యుదాఘాతంతో నికేశ్ ఆత్రం(22) మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన నికేశ్ ఆత్రం మండలంలోని ఒడ్డేపల్లి శివారులో నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ వద్ద కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంజీరా నది వద్ద ఉన్న మట్టిని యంత్రంతో పరీక్ష చేస్తుండగా ఇనుప పైపుకు ఉన్న కరెంట్ వైరు తగలడంతో మృతి చెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గుమాస్తా కాలనీలో మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుమస్తాకాలనీలో గంగోని సంతోష్ ఇంట్లో మేస్త్రీ పని చేస్తున్న చింతకాయల కుమార్(39) అకస్మాతుగా మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. యథావిధిగా పనికి వెళ్లిన కుమార్ మంగళవారం మధ్యాహ్నం పనిచేస్తుండగా కుప్పకూలిపోయాడు. దీంతో మృతుడి సోదరుడికి సమాచారం అందించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు..



అనిల్(ఫైల్)

భిక్కనూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘట న మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎ స్సై సాయికుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెంది న చిన్నోళ్ల అనిల్ (25) దుస్తులను ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగి మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారులో మంటలు



కారులో నుంచి వస్తున్న మంటలు

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్ చౌరస్తాలో ప్రయాణిస్తున్న కారు నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జుక్కల్ నుంచి స్వరాజ్ తన తండ్రి గంగారాంతో కలిసి జిల్లా కేంద్రంలోని బ్రీజా కారు షోరూంలో సర్వీసింగ్‌కు వచ్చినట్లు చెప్పారు. శివాజీనగర్ చౌరస్తా వద్దకు రాగానే కారులో మంటలు చెలరేగినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్‌సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది నరేశ్, సునీల్, ఆశీష్, సుధాకర్, రఘు ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన బాలిక (15)పై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. అదే కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ముజాహిద్, ముదాసీద్‌లు ఇంట్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలం బోర్గాం(కె) చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు మంగళవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

రైల్వేస్టేషన్‌కు ఫేక్‌కాల్

- అప్రమత్తమైన రైల్వే అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు సోమవారం రాత్రి 8.30 వచ్చిన అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగుతున్నాయని 100కి ఫేక్ కాల్ వచ్చింది. దీంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో ఆగిన అజంతా రైలును పూర్తిగా రైల్వే, జీఆర్పీ పోలీసులు, ఫైర్ సిబ్బంది తనిఖీ చేశారు. ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు నిర్ధారించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ కాల్‌చేశారని, రైలుకు ఎలాంటి ప్రమాద జరగలేదని కామారెడ్డి రైల్వే స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ ఫేక్ కాల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫలించిన ఎమ్మెల్సీ కవిత పోరాటం

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మెల్సీ చేసిన పోరాట ఫలితమే ఈ విజయమని అన్నారు. ఎమ్మెల్సీ పోరాటం, కృషితో కేంద్ర ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు.

మహిళా బిల్లు తీసుకొచ్చింది కాంగ్రెస్సే

- మాజీ మేయర్, కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి సంజయ్



మాట్లాడుతున్న మాజీ మేయర్ సంజయ్

ఖలీల్‌వాడి: మహిళా బిల్లును నాటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ హయాంలోనే తీసుకొచ్చినట్లు మాజీ మేయర్, కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి సంజయ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలో విజయభేరి సభను విజయవంతం చేసిన అర్బన్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సభలో ఆరు గ్యారెంటీ పథకాలు ప్రకటించారని ప్రతి కార్యకర్త, నాయకులు దీనిని ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.2500, గ్యాస్ సిలెండర్‌కు రూ. 500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుందని, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఏటా రూ.15 వేలు, రైతుబంధు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం భూస్వాములకు మేలు చేసే విధంగా మాత్రమే దానిని రూపొందించిందని ఆరోపించారు. రైతు భరోసా పథకం ద్వారా కౌలు రైతులకు కూడా ప్రతి ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఏడాదికి అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని అందజేస్తుందని, యువ వికాసం ద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు తోపాటు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తుందన్నారు. చేయూత పథకం ద్వారా రూ.4 వేలు నెలవారి పింఛను అందిస్తుందని తెలిపారు. రూ.10 లక్షలు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా అందజేస్తామన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు తీసుకొచ్చారని అన్నారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ బిల్లు కల్పించాలని పార్లమెంట్‌కు కమిటీ లేఖ రాయడంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడానికి అవకాశం వచ్చిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు లవంగ ప్రమోద్, హాకీ శ్రీనివాస్, మహేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ విజయభేరిని భగ్నం చేసేందుకు కుట్ర

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ విజయభేరిని భగ్నం చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కుట్ర పన్నాయని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17న నిర్వహించిన విజయభేరి సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సభను భగ్నం చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం వేర్వేరుగా సభలు నిర్వహించి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు బీఆర్ఎస్, బీజేపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మీసాల సుధాకర్ రావు, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు జావిద్ అక్రమ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్, సేవాలాల్ అధ్యక్షుడు సంతోష్, బీసీ సెల్ అధ్యక్షుడు నరేంద్ర గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతం, సిరికొండ గంగారెడ్డి, కేశ రాజు, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి

బాల్కొండ: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుస్సాపూర్‌కు చెందిన నవీన్‌రెడ్డి తన స్కూటీలో 300 గ్రాముల ఎండు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో తీసుకొని బుస్సాపూర్ నుంచి మెండోరా వైపు వస్తుండగా పోలీసులను చూడగానే తప్పించుకునే ప్రయత్నం చేశాడు. గమనించిన వారు వెంబడించి పట్టుకున్నారు. తనిఖీలో పట్టుబడ్డ గంజాయిని నిందితుడు మహారాష్ట్రలోని కిన్వాట కొరటికల్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని తహసీల్దార్ సంతోష్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. గతంలో నిందితుడు గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితుడని, నవీన్‌రెడ్డి గతంలో ఓ వృద్ధుడిని హత్య చేసి జైలుకు వెళ్లివచ్చాడని తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తుల నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల శివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద కోరుట్లకు చెందిన మహ్మద్ సాహెబ్, మహ్మద్ ఇర్ఫాన్, ఐలాపూర్‌కు చెందిన సిరిగిరి సందీప్ అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు విచారించి 300 గ్రాముల గంజాయితో పాటు బైక్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇదే కేసులో ఐలాపూర్‌కు చెందిన బన్నీగౌడ్ పరారీలో ఉన్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

సంక్షిప్తం..

ఇసుక టిప్పర్ల అడ్డగింత

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను లారీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఇసుక టిప్పర్ల నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

చిట్టి డబ్బుల కోసం వెళ్తే దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్, అతని భార్య చిట్టి డబ్బుల కోసం వెళ్తే నిర్వాహకుడు రాంగిరి నరేశ్, సతీశ్‌లు దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శ్రావణ్‌కుమార్ కాలనీలోని పక్కగల్లీలో ఉంటున్న రాంగిరి నరేశ్ వద్ద రూ.8.50 లక్షల చిట్టీలు వేశారు. చిట్టీలు పూర్తియినా డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో భార్య, భర్తలు చిట్టి డబ్బుల విషయమై నరేష్ ఇంటికి వెళ్లి అడుగగా నరేష్‌తో పాటు అతని తమ్ముడు రాంగిరి సతీశ్ దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్ వద్ద నుంచి రూ.8 వేలు, సెల్‌ఫోన్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఈ నెల 13న రూరల్ మండలంలోని మల్లారం పరిధిలోని చక్రదర్‌తండాకు చెందిన శ్రీనివాస్ కిడ్నీలో రాళ్ల సమస్య కారణంగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చాడు. 14న పేషెంట్ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ. 8 వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న మహ్మద్ అబ్దుల్ లతీఫ్, అమీర్ బీన్ మహ్మద్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వీరు ఆహ్మదీ మార్కెట్, గోషాల్‌రోడ్డు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్‌నగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎర్రం మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. బెల్ట్‌షాపులో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మద్నూర్‌లో బంగారం చోరీ

మద్నూర్(జుక్కల్): బంగారు నగలు పాలిష్‌చేస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి దుండుగుల 45 గ్రాముల బంగారాన్ని చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలోని మార్వాడి గల్లీలో సోమవారం చోటు చేసుకుంది. పప్పు సేట్ ఇంటికి వెళ్లిన దుండగులు ఆయన లేకపోవడంతో భార్య పుష్ప జవార్‌తో మాటలు కలిపారు. తాము మహారాష్ట్ర నుంచి వచ్చామని తమ వద్ద బంగారాన్ని తక్కువ ధరకు పాలిష్‌చేసే పౌడర్‌ఉందని నమ్మబలికారు. నమ్మిన పుష్ప జవార్ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం, ఐదు గ్రాముల కమ్మలు కడిగి ఇవ్వాలని ఇచ్చింది. వారు కుక్కర్, పసుపు నీరు తీసుకురమ్మని చెప్పి అందులో బంగారం వేసినట్లు నమ్మించారు. కుక్కర్‌ను పొయ్యి మీద పెట్టాలని చెప్పి వెళ్లిపోయారు. కుక్కర్‌లో బంగారం లేకపోవడంతో మోసపోయినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

I, ALAKHYA SANGEMU (Old Name) W/o. SADHU CHETAN KUMAR Changed my name as SADHU ALEKHYA(New Name) W/o. SADHU CHETAN KUMAR R/o.H.No:6-1-152, Kanteshwar, NZB.T.S [Z-799595]

I, TADGUM LAKSHMI (Old Name) H.No:1-1/3A, Navipet, Nizamabad. Hence changed my name as THADAGAM LAXMI, W/o.THADAGAM ASHOK (New Name). [Z-799596]

I, TADGUM ASHANNA (Old Name) H.No:1-1/3A, Navipet, Nizamabad. Hence changed my name as THADAGAM ASHOK, S/o.T. SAYANNA (New Name). [Z-799597]

WANTED

Wanted Experienced English Faculty to teach upto - X Class. Part / Full time (Salary: upto 40000) Contact: 9963098957, Mail: schoolresumes2022@gmail.com [Z-799588]

Wanted Teachers for Nursery to VII Class (All Subs), Incharges, P.E.T., Vice Principal, Principal. Cont: (Saloora, Bodhan): 9948378237. [Z-799589]

Wanted Experienced Lab Technicians Night Duty/Day. Vegitarian Maharashtrian/ Brahmin Cook, Experienced Accounted CA Office. Mob: 9346605125, 9848175581. [Z-799593]

Wanted E/M Lady Teachers To Teach Up to Vth English, Maths & EVS, Salary Negotiable. (School Vehicle Facility for Staff) Just 10 km from NZB. Cell: 9989448828. [Z-799594]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.